మల్లాపూర్‌లో హోలీ ఆడుతున్న చిన్నారులు

పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

కొడిమ్యాల: మండలంలో డీజే పెట్టి సంబురాలు జరుపుకుంటున్న యువకులు

హోలీ.. రంగేలి

సంబురాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల/రాయికల్/జగిత్యాల కలెక్టరేట్/సారంగాపూర్/కొడిమ్యాల/మెట్పల్లి/మెట్పల్లి రూరల్/కోరుట్ల/ కోరుట్ల రూరల్/మల్లాపూర్/ పెగడపల్లి /కథలాపూర్/జగిత్యాల టౌన్/ ఇబ్రహీంపట్నం/మేడిపల్లి, మార్చి 25: జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, పిల్లలు హోలీ సంబురాల్లో రంగులు పూసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్లపై చిన్నారులు రంగులు చల్లుకుంటూ చిందులు వేయగా పలువురు డప్పుల చప్పుళ్లతో, కోలాటాలు ఆడారు. డీజేలు పెట్టి నృత్యాలు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఇంట్లో హోలీ సంబురాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, టీచర్లు, యువకులు, కుల సంఘాల నాయకులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనకు హోలీ సందర్భంగా రంగులు పూశారు. రాయికల్ ప్రెస్‌క్లబ్ జేఏసీ ఆధ్వర్యంలో జరుపుకొన్న హోలీ వేడుకల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొని పాత్రికేయులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ క్యాంప్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత వేడుకల్లో పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయం సిబ్బంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై దావ వసంతకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హోలీ ఆడారు. వేడుకల్లో అడిషనల్ ఎస్పీలు వినోద్‌కుమార్, భీమ్‌రావు, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీలు పాల్గొన్నారు. మెట్పల్లిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు హోలీ వేడుకలు జరుపుకొన్నారు. మల్లాపూర్‌లో ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల జిల్లా టీఎన్జీవోల సంఘం తరపున జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మేడిపల్లిలో హోలీ సంబురాల్లో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి పాల్గొన్నారు. సారంగాపూర్, కొడిమ్యాల, మెట్పల్లి, మెట్పల్లి రూరల్, కోరుట్ల, మల్లాపూర్, పెగడపల్లి, కోరుట్ల రూరల్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, యూత్ సభ్యులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

రాయికల్: హోలీ వేడుకల్లో పాల్గొన్న జీవన్ రెడ్డి

జగిత్యాల: జడ్పీ కాంప్ కార్యాలయంలో ఉద్యోగులతో దావ వసంత


ఇబ్రహీంపట్నం: హోలీ ఆడుతున్న యువకులు

మెట్పల్లి: హోలీ సంబురాల్లో ఉపాధ్యాయులు

కోరుట్ల: హోలీ వేడుకల్లో పోపా నాయకులు

జగిత్యాల టౌన్: హోలీ సంబురాలు జరుపుకొంటున్న టీఎన్జీవో నాయకులు

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి

● మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్

సమావేశంలో మాట్లాడతున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మపురి,మార్చి 25: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి వెళ్లిందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ధర్మపురిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు మాసాల్లోనే కరువు వచ్చిందనే విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. కాంగ్రెస్ ఓ డ్రామా కంపెనీ అని, ఆరు గ్యారెంటీల అమలు విషయంలోనే ప్రజలకు అర్థమైందన్నారు. రాష్ట్రంలో చేయాల్సిన అభివృద్ధిని పక్కనబెట్టి కేసీఆర్‌ను బద్నాం చేయడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుకున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను తీసుకువచ్చిన కేసీఆర్‌ను నోటికి వచ్చినట్లు తిట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారా? అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని అధైర్యపడకుండా బీఆర్ఎస్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోవాలన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, నాయకులు సొళ్ల భీమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు. కాగా, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా..సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్వామివారి డోలోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించారు.

'నమస్తే' బ్యూరోకు పరామర్శ

ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి

సిరిసిల్ల రూరల్/బోయినపల్లి, మార్చి 25 : నమస్తే తెలంగాణ దిన పత్రిక కరీంనగర్ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మరణించింది. సోమవారం వారి స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామ పరిధిలోని నైనివారిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం ప్రకాశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులను నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపరేషన్స్ జీఎం సీహెచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు.

ఏఎస్ఐ వ్యవహారంపై పోలీస్ శాఖ సీరియస్

● యువతితో సన్నిహిత ఫొటోలు బయటకు రావడంపై విచారణ

ఇబ్రహీంపట్నం, మార్చి 25: వివాహితతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు బయటకు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఏఎస్ఐపై చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. భర్త తరచూ కొడుతున్నాడని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఓ వివాహిత కొద్ది నెలల క్రితం ఫిర్యాదు చేసింది. విచారణ పేరిట మహిళ ఇంటికి వెళ్లిన ఇబ్రహీంపట్నం ఏఎస్ఐ సదరు మహిళతో పరిచయం పెంచుకుని సన్నిహితంగా మెలగడం ప్రారంభించాడు. ఈ క్రమంలో సదరు మహిళతో దిగిన ఫొటోలు సోషల్ మీడియా ద్వారా బయటకు రావడం సంచలనంగా మారింది. ఈ విషయమై పోలీసు శాఖ విచారణ చేపట్టింది. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌ను వివరణ కోరగా, ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎస్ఐ తెలిపారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉండి, కూతురి కంటె చిన్న వయస్సు గల మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఏఎస్ఐ వ్యవహార శైలిపై మండలవాసులు మండిపడుతున్నారు.

మల విసర్జనకు వెళ్లి.. కెనాల్‌లో పడి

● మతిస్థిమితం లేని యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: మతిస్థిమితం లేని యువకుడు మల విసర్జనకు వెళ్లి..కాలు జారి కెనాల్‌లో పడి మృతిచెందిన ఘటన రాయికల్ పట్టణంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణానికి చెందిన జిల్లాల నవీన్ (28)కు మతిస్థిమితం సరిగా లేదు. నవీన్ ప్రతి ఆదివారం చర్చికి వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కుమ్మరిపల్లి శివారులోని చర్చికి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి గురించి వెతికారు. కాగా, ఆదివారం రాత్రి ఎస్సారెస్పీ కాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. నవీన్ చర్చికి వెళ్లిన తర్వాత దానికి దగ్గరలో ఉన్న ఎస్సారెస్పీ కాలువ వద్దకు మల విసర్జనకు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలుజారి కాలువ నీటిలో పడి మునిగి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటిపై కోడిగుడ్డు ఎందుకు వేశావన్నందుకు..

● మహిళపై కొడవలితో యువకుడి దాడి

గాయాలైన రమ

జగిత్యాల, మార్చి 25: హోలీ వేడుకల్లో విషాదం నెలకొన్నది. మహిళపై యువకుడు కొడవలితో దాడి చేయగా, తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల మండలం తిప్పన్నపేట లో హోలీ వేడుకల్లో స్థానికులు పాల్గొన్నారు. ఈ క్రమంలో యువకుడు బోగు ప్రకాశ్ , మేడిశెట్టి రమ ఇంటిపైకి కోడిగుడ్డు వేశాడు. కోడిగుడ్డును మా ఇంట్లోకి ఎందుకు వేశావని రమ కొడుకు రిషి, ప్రకాశ్‌ను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ ముదిరింది. గొడవ ఆపే ప్రయత్నం చేసినా రిషి తల్లి రమపై ప్రకాశ్ కొడవలితో దాడి చేశాడు. ప్రకాశ్ కుటుంబానికి, రమ కుటుంబానికి పాత తగాదాలు ఉన్నాయి. గాయాలైన రమను చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు యువకులపై కేసు

రాయికల్, మార్చి 25: ప్రభుత్వ దవాఖాన వైద్యులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజయ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన సూర్య, కిరణ్, అభి, సన్ని మరికొంతమంది రాయికల్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై దౌర్జన్యం చేసి వారిని దర్భాషలాడడమే కాకుండా బెదిరించారు. డ్యూటీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడికి సన్మానం

ఇబ్రహీంపట్నం, మార్చి 25: వర్షకొండ గ్రామానికి చెందిన రాహుల్ జాతీయ స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా సోమవారం తాండ్ర రాహుల్‌ను ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోన్‌కంటి వెంకట్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో జరిగే 52వ సీనియర్ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు రాహుల్ ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో దొంతుల తుక్కారాం, గుజ్జెరి ప్రకాశ్, గంగాధర్, బొబ్బిలి కిషోర్,యువకులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

కొడిమ్యాల, మార్చి 25: డబ్బుతిమ్మాయిపల్లి గ్రామంలో ఓ ఇంట్లో దాదాపు రూ.17 వేల విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌బీ ఏఎస్ఐ అనంద్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, GUNTHA SANTOSH, R/o. 8-178/1, Gollapally, Jagityal, TS, have Changed My Name as GUNTHA SANTHOSH KUMAR, S/o. Jagannatham.
NT-311781

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 25: జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ మాజీ సర్పంచ్ జోగినిపెల్లి సత్యనారాయణరావు తల్లి, ప్యాక్స్ చైర్మన్ సందీప్‌రావు నాయనమ్మ లక్ష్మీబాయ్ మృతిచెందగా, బాధిత కుటుంబాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, రాధిక దంపతులు పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, నాయకులు మంచాల కృష్ణ, హరికిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వైద్యానికి సాయం

పెగడపల్లి, మార్చి 25: బతికపల్లి గ్రామానికి చెందిన తుమ్మ లక్ష్మణ్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ, హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు సోమవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జుంజురు రాజమల్లు, సభ్యులు దూస ప్రసాద్, పెంట మల్లేశం, నరేందర్, ఒల్లాల వెంకటేశం, కముటం లక్ష్మీరాజం, రమేశ్, లక్ష్మణ్, రాజమల్లు, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు ఆరు బయట వేయొద్దు

కోరుట్ల, మార్చి 25: సెప్టిక్ ట్యాంకు నుంచి తీసిన మానవ వ్యర్థాలను ఆరు బయట పడేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కల్లూరు రోడ్డులో సెప్టిక్ ట్యాంకు నుంచి తీసిన వ్యర్థాలను క్లీనింగ్ నిర్వాహకులు ఆరు బయట పడేయడంతో అధికారులు వాహన యజమానికి రూ. 5 వేల జరిమానా విధించారు. సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేసే వాహన యజమానులు తప్పని సరిగా మున్సిపల్ లైసెన్స్ తీసుకోవాలని కమిషనర్ సూచించారు. గృహాల నుంచి సేకరించిన మల, మూత్రాలను పట్టణ శివారులోని మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ)లోకి తరలించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మానవ వ్యర్థాలను వదిలివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, తదితరులున్నారు.

స్వర్ణ నంది పురస్కారం

జగిత్యాల, మార్చి 25: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన శివ రాత్రి స్వర్ణ నంది పురస్కారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మన జగిత్యాల మేదిని లలిత కాలక్షేత్రం ఆధ్వర్యంలో చేసిన నృత్య ప్రదర్శనకు గానూ స్వర్ణ నంది పురస్కారం వరించింది. భారత్ ఆర్ట్స్ అకాడమీ అధినేత్రి లలితారావు, ప్రముఖ నాట్య కళాకారిణి, సీరియల్ ఫేం జ్యోతిరెడ్డి, ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞశర్మ తదితరులు మన జగిత్యాల మేదిని లలిత కాలక్షేత్రం నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేశ్‌కుమార్, శిష్యులకు స్వర్ణనందులను అందజేశారు. మేదిని లలిత కళాక్షేత్రం అధ్యక్షుడు మేదిని భుజంగరావు, నాట్య సామ్రాట్ నరేశ్‌కుమార్, శిష్యులకు అభినందనలు తెలియజేశారు.

వైభవంగా ఉగ్ర నృసింహస్వామి తెప్పోత్సవం

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బ్రహ్మపుష్కరిణి(కోనేరు)లో కొత్త(ఉగ్ర)లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవ కార్యక్రమాలు కనుల పండువగా, వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయం నుంచి స్వామివార్ల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన సేవపై ఉంచి మేళతాళాల మధ్య కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కోనేరులో అప్పటికే అలంకరించిన హంస వాహనంపై స్వామివార్లను ఆసీనులను చేసి కోనేరులో చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారితో పాటు భక్తులు కూడా ప్రదక్షిణ చేసి బుకగులాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కోనేరు మధ్యలో గల మండపంలోని ఊయలలో స్వామివార్లను ఉంచి పండితులు మంత్రోచ్ఛారణల మధ్య డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. కాగా ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

కోనేరులో నిర్వహిస్తున్న ఉగ్రనారసింహస్వామివారి తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో నేడు..

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి దక్షిణ దిగ్యాత్రలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి జాతర

కథలాపూర్: కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీపీ

వేములకుర్తిలో వేంకటేశ్వరస్వామి కల్యాణంలో తాళిని ప్రదర్శిస్తున్న అర్చకులు

కథలాపూర్, మార్చి 25: గంభీర్‌పూర్‌లో లక్ష్మీ నృసింహస్వామి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేవతి, సింధూజ, రాజశేఖర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

కథలాపూర్, మార్చి 25: తక్కళ్లపెల్లిలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని ప్రధాన వీధులగుండా రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

కమనీయంగా వెంకన్న కల్యాణం

ఇబ్రహీంపట్నం, మార్చి 25: వేములకుర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు చక్రపాణి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వెంకన్న కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామివారిని ఊరేగించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, సహకార సంఘ అధ్యక్షుడు రాజన్న, మాజీ సర్పంచ్ నవ్యశ్రీ, మాజీ ఎంపీటీసీ పెంట లక్ష్మి, అర్చకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

వెల్గటూర్, మార్చి 25: ఎండపల్లి మండలం గుల్లకోటలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాన మారుతి, మాజీ సర్పంచ్ పొన్నం సరూప, మాజీ సర్పంచ్ సింహాచలం జగన్, భూసారపు రమేశ్, గొల్లపల్లి శంకర్, రేణిగుంట శ్రీనివాస్, గుండా గంగయ్య, జల్లెళ్ల కనకయ్య, శ్రీనివాస్, ఎడ్లబండ్ల పోటీదారులు, పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ దంపతుల పూజలు

జగిత్యాల రూరల్, మార్చి 25: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలోని నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నరసింహస్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని స్వామివారిని కోరుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మైపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు పెండెం శ్రీను, కార్యదర్శి మనోహర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సత్తన్న, బాలె చందు, గంగాధర్, శేఖర్, సురేశ్, గంగరాజం, రంజిత్, అంజయ్య, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

రాయికల్, మార్చి 25: మండలంలోని ఇటిక్యాల వేంకటేశ్వరస్వామి, చింతలూరు వేణుగోపాలస్వామి ఆలయాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆయా గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సారంగాపూర్, మార్చి 25: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. గ్రామంలో మహాలక్ష్మి, సారగమ్మ, బంగారు పోచమ్మ, ముత్యాల పోచమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు నూతనంగా ఆలయాలు నిర్మించారు. ఆలయాల్లో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కథలాపూర్, మార్చి 25: చింతకుంటలోని రామాలయం కొండపై ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. గండి హనుమాన్ ఆలయ అర్చకులు మాధవాచారి, వినోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహానికి భూమి పూజ చేశారు. ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ దాత గద్దె నరహరి, రామాలయ కమిటీ సభ్యులు, భక్తులు, హనుమాన్ దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు.